RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in   rajadhanivoicedaily@gmail.com

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు మండలాల వారీగా విలేఖరులు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించగలరు.

9030343195

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 273 | 25 మంగళవారం ఆగష్టు 2026 | ఎడిటర్ : పొగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

## ఫుడ్ ప్రాసెసింగ్‌తో పంటలకు విలువ.. ప్రపంచ మార్కెట్లే లక్ష్యం: సీఎం చంద్రబాబు

**దేశీయ పాప్‌కార్న్ విత్తనాలను ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి, సీఎం**

**ఫుడ్ ప్రాసెసింగ్‌తో వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు**

**ఆంధ్రా పాప్‌కార్న్, అరకు కాఫీలను గ్లోబల్ బ్రాండ్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**రాయలసీమను ఉద్యాన హబ్‌గా మార్చేందుకు భారీ ప్రణాళిక**

**నదుల అనుసంధానంతో నీటి భద్రత సాధిస్తామన్న చంద్రబాబు**



**రాజదాని వాయిస్ ఏలూరు, ఆగస్టు 24** :వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా విలువ జోడించి, అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఫుడ్ ప్రాసెసింగ్ ప్రక్రియతో ఉత్పత్తుల విలువ పెరిగి, రైతులకు ప్రయోజనం కలగడమే కాకుండా రాష్ట్రంలో సంపద సృష్టి జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం ఏలూరు జిల్లా ముసునూరు వద్ద ఏర్పాటు చేసిన 'గార్మే పాప్ కార్నికా' నాన్-జీఎంఓ హైబ్రీడ్ మొక్కజొన్న విత్తనాలను ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం దేశంలోనే అతిపెద్ద పాప్‌కార్న్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. "రైతులపై ఉన్న ప్రేమతో ఉపరాష్ట్రపతి ఏలూరు జిల్లాకు వచ్చి జన్యుమార్పిడి చేయని మొక్కజొన్న విత్తనాలను ఆవిష్కరించారు. గార్మే పాప్ కార్న్ సంస్థ మన దేశీయ నేలపైనే రైతులతో కలిసి నాన్-జీఎంఓ విత్తనాలను ఉత్పత్తి చేయడం అభినందనీయం. నూజివీడు గడ్డపై పండిన ఈ పాప్‌కార్న్ దేశవిదేశాలకు ఎగుమతి కావడం గర్వకారణం" అన్నారు. 17,500 మంది రైతులతో 40 వేల ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తూ, దేశీయ పాప్‌కార్న్ ఉత్పత్తిలో 70 శాతం వాటాను కలిగి ఉండటంపై గార్మె సంస్థను ఆయన ప్రశంసించారు. ఇప్పటివరకు పాప్‌కార్న్ కోసం బ్రెజిల్ వంటి దేశాలపై ఆధారపడ్డామని, ఇకపై ఆ సంపద మన దేశంలోనే ఉంటుందని తెలిపారు.

**గ్లోబల్ బ్రాండ్లుగా మన ఉత్పత్తులు**

"ఆంధ్రా పాప్‌కార్న్, అరకు కాఫీ, కోస్తా కోకో వంటివి ▶▶2

## వచ్చే ఎన్నికల్లో ఆలేరు బరిలో తీన్మార్ మల్లన్న

- యువత ప్రశ్నలకు సూటిగా సమాధానాలు
- విద్య, వైద్యానికి 40 శాతం బడ్జెట్ డిమాండ్
- సెప్టెంబర్ 17 నుంచి రాష్ట్రవ్యాప్త పాదయాత్ర
- రిజర్వేషన్లపై స్పష్టమైన అభిప్రాయం



**రాజదాని వాయిస్ మేడ్చల్ మల్కాజిగిరి, ఆగస్టు 24** : తెలం గాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ మైదానంలో నిర్వహించిన "జెన్ జీ అడ్డా విత్ మల్లన్న" కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొని విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వేలాది మంది విద్యార్థులు హాజరై విద్య, ఉపాధి, సామాజిక న్యాయం, రాజకీయాలు, రిజర్వేషన్లు, స్కాలర్‌షిప్ లకు సంబంధించిన ప్రశ్నలను ▶▶2

## సీఎం విజయ్ సంచలన ప్రకటన..

### పొంగల్ నుంచి ఉచితంగా గ్యాస్ సిలిండర్లు..




**రాజదాని వాయిస్** చెన్నై: తమిళనాడు అసెంబ్లీ వేదికగా మహిళలపై ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ వరాల జల్లు కురిపించారు. ఎన్నికల హామీ మేరకు సోమవారం శాసనసభ సాక్షిగా పలు సంక్షేమ పథకాలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించనున్నట్లు ▶▶2

## కావేరీ వివాదంపై సుప్రీంకోర్టులో విచారణ.. తమిళనాడుకు కీలక సూచన..

కర్ణాటక-తమిళనాడు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న కావేరీ జల వివాదంపై సుప్రీంకోర్టు సోమవారం కీలక సూచనలు చేసింది. కర్ణాటక నుంచి తమకు రావాల్సిన కావేరీ నీటి వాటా సక్రమంగా అందడం లేదంటూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సమస్యపై ముందుగా కావేరీ జల నిర్వహణ ప్రాధికార సంస్థ ను ఆశ్రయించాలని తమిళనాడుకు సుప్రీంకోర్టు సూచించింది జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం తమిళనాడు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించింది. కర్ణాటక నుంచి తమకు దామాషా ప్రకారం రావాల్సిన నీరు విడుదల కావడం లేదని తమిళనాడు తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు.. నీటి పంపిణీ, విడుదలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన కావేరీ జల నిర్వహణ ప్రాధికార సంస్థను ముందుగా ఆశ్రయించాలని తమిళనాడుకు సూచించింది వర్షాభావం కారణంగా నీటి నిల్వలు తగ్గాయని కర్ణాటక చెబుతోంది. అయినా తమకు రావాల్సిన న్యాయమైన వాటా నీటిని విడుదల చేయాలని తమిళనాడు పట్టుపడుతోంది ఈ విషయమై సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే సీడబ్ల్యూఎమ్ఏ ద్వారానే ఈ వివాదాన్ని పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. సాంకేతిక లెక్కింపులు, నీటి నిల్వల ఆధారంగా సీడబ్ల్యూఎమ్ఏ తుది నిర్ణయం తీసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది.



## పులివెందుల తాగునీటి పథకానికి ఊపిరి

- పవన్ కళ్యాణ్ చొరవతో వేగవంతమైన పనులు
- రూ. 280 కోట్లతో పునరుద్ధరణ చర్యలు
- 96 శాతం పనులు పూర్తి చేసిన అధికారులు
- లక్షల మందికి శాశ్వత తాగునీటి భరోసా





**రాజదాని వాయిస్ కడప, ఆగస్టు 24** : పులివెందుల నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకం వేగంగా పూర్తి దశకు చేరుకుంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో ఈ పథకం పనులు పునరుద్ధరించబడి వేగవంతమయ్యాయి. జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార పథకాల కింద భారీ నిధులు కేటాయించి పనులను ముందుకు తీసుకెళ్తున్నారు. ఏడు మండలాల పరిధిలో సుమారు ఐదున్నర లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించే ఒదుకు రూ. 480 కోట్ల అంచనా వ్యయంతో ▶▶2

## ముసునూరు విజయగాథగా నిలిచింది

**- అభివృద్ధి, జాతీయవాదం సమతుల్యం చేసిన నాయకత్వం**

**- రైతులే దేశానికి నిజమైన వెన్నెముక**

**- పాప్‌కార్న్ విత్తన ఆవిష్కరణలో ప్రశంసలు**

**- వ్యవసాయ రంగ ప్రాధాన్యంపై ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలు**



**రాజదాని వాయిస్ ఏలూరు, ఆగస్టు 24** : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వాన్ని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రశంసించారు. చంద్రబాబు ఒక నిజమైన జాతీయవాది అని, అదే సమయంలో రాష్ట్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిచ్చే నాయకుడని పేర్కొన్నారు. జాతీయవాద భావన రాష్ట్ర ప్రగతికి అడ్డంకిగా మారకుండా సమతుల్యం చేయగల సామర్థ్యం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. ఏలూరు జిల్లా ముసునూరులో నిర్వహించిన నాన్-జీఎంఓ హై ఎక్స్‌పాన్షన్ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తన ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపరాష్ట్రపతి ఈ వ్యాఖ్యలు చేశారు. ముసునూరు గ్రామాన్ని వ్యవసాయ రంగంలో ఆదర్శంగా తీర్చిదిద్దినందుకు ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణాభివృద్ధి, రైతుల సంక్షేమం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ప్రోత్సాహంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ముసునూరు విజయగాథ దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా స్ఫూర్తిగా నిలుస్తుందని అభిప్రాయ పడ్డారు.ఈ కార్యక్రమం తనకు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకమైందని ఉపరాష్ట్రపతి తెలిపారు. రెండు నెలల క్రితం ఒక తమిళ దినపత్రికలో పారిశ్రామికవేత్త ఎస్పీబీ పట్టాభి రామారావు మొక్కజొన్న పరిశ్రమలో సాధించిన విజయాల గురించి చదివినట్లు చెప్పారు. ఒకే వ్యవసాయ ఉత్పత్తిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ఆయన ప్రయాణం తనను ఆకట్టుకుందని, వెంటనే అభినందనల లేఖ పంపినట్లు వివరించారు. అనంతరం పట్టాభి రామారావు తనను కలిసి ▶▶2



దేశంలోని అన్ని రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులకు కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే బహిరంగ లేఖ రాశారు. అందులో ప్రాథమిక విద్య అనేది రాజకీయ సమస్య కాదని.. ప్రతి బిడ్డ ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల లేమిని ఎత్తిచూపారు. వాటిని మెరుగుపరచడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల పునరుద్ధరణను అత్యవసర ప్రాధాన్యతగా పరిగణించాలని మంత్రులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సీజేపీ 'స్కూల్ ఠీక్ కరో' కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన పలు డిమాండ్లు లేవనెత్తారు. అవేంటంటే..?

మౌలిక సదుపాయాలు: గత ఐదేళ్లలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలు పునరుద్ధరించారనే డేటా.. ప్రస్తుతం తక్షణ మరమ్మతులు లేదా పూర్తిస్థాయి పునరుద్ధరణలు అవసరమైన పాఠశాలల మొత్తం సంఖ్యను విద్యాశాఖ మంత్రులు వెల్లడించాలి.

**ప్రాథమిక సౌకర్యాలు:** మరుగుదొడ్లు, శుభ్రమైన తాగునీరు, డిజిటల్/కంప్యూటర్ లెర్నింగ్ సౌకర్యాలు, ప్లే గ్రౌండ్, సరైన క్రీడా పరికరాలు కలిగిన ప్రభుత్వ పాఠశాలల సంఖ్య

**ఉపాధ్యాయ ఖాళీలు:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లోని మొత్తం బోధనా పోస్టుల సంఖ్య, ప్రస్తుతం భర్తీ చేసిన పోస్టులు, ఖాళీల వివరాలు.

ఆర్థిక జవాబుదారీతనం: గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించిన నిధులు, క్షేత్రస్థాయిలో వాస్తవంగా ఖర్చు చేసిన వ్యయంతో వాటిని పోల్చి చూపే వివరాలు.**నాణ్యమైన విద్య:** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి వీలుగా ఏర్పాటు చేయాల్సిన అదనపు పాఠశాలల సంఖ్య వివరాలు.బోధనేతర విధులు: పాఠశాలల్లో బోధన కాకుండా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు కేటాయించే ఇతర విధులకు సంబంధించిన వివరాలు స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలైనా దేశంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ఇప్పటికీ సరైన మరుగుదొడ్లు, సురక్షితమైన తాగునీరు, సరైన తరగతి గదులు, బెంచీలు వంటి సౌకర్యాలు లేవని దీప్కే పేర్కొన్నారు.

## తిరుపతి డీఎస్పీ పేరిట రూ.కోట్లలో మోసం.. కేటుగాడి అరెస్ట్



**రాజదాని వాయిస్** హైదరాబాద్ : తిరుపతి జిల్లా డీఎస్పీనంటూ నకిలీ అవతారమెత్తి, బోగస్ కంపెనీల్లో పెట్టుబడుల పేరిట అధిక లాభాలు ఇప్పిస్తానని నమ్మించి అమాయకులను నిలువునా ముంచిన ఓ ముఠా సభ్యుడిని హైదరాబాద్ సీసీఎస్ (డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్) ఈఓడబ్ల్యూ బృందం అరెస్టు చేసింది. నిందితుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అన్నమయ్య జిల్లా, రాయచోటికి చెందిన కొండూరు రెడ్డి వెంకట్ రాజు అలియాస్ కేవీపీ రాజు అలియాస్ డీఎస్పీ రాజు (40)గా పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు కేవీపీ రాజు, కొంతమంది ముఠా సభ్యులతో కలిసి తాము సీనియర్ పోలీస్ అధికారులమని ప్రచారం చేసుకుంటూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని అనేక మంది అమాయకులను లక్ష్యంగా చేసుకున్నారు. ఉనికిలో లేని నకిలీ కంపెనీల్లో పెట్టుబడులు పెడితే స్వల్పకాలంలోనే అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. బాధితులకు నమ్మకం కలిగించేందుకు సెక్యూరిటీ పేరిట నకిలీ ఆస్తి పత్రాలు, పోస్ట్ డేటెడ్ చెక్కులను ఇచ్చేవారు.అయితే సమయానికి డబ్బు తిరిగి ఇవ్వకపోగా, బాధితులు నిలదీస్తే తాము 'ఎన్‌కౌంటర్ స్పెషలిస్టులమంటూ' బెదిరింపులకు దిగేవారు. ఈ క్రమంలోనే ఒక ఫిర్యాదుదారుడి నుంచి రూ.1.20 కోట్లు వసూలు చేసి మోసం చేశారు. దీంతో బాధితుడు సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదయింది. హైదరాబాద్ సీసీఎస్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ నేతృత్వంలో, ఏసీపీ కె. కిరణ్ పర్యవేక్షణలో ఎస్సై జి. అనిల్ కుమార్, సిబ్బంది నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. అధిక లాభాలు ఇప్పిస్తామంటూ చేసే నకిలీ హామీలు, ప్రచారాలను నమ్మి అమాయక ప్రజలు ఎవరూ తమ కష్టార్జితాన్ని పెట్టుబడిగా పెట్టి మోసపోవద్దని హైదరాబాద్ సీసీఎస్ డిప్యూటీ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## మాజీ మంత్రి కారుమూరికి 14 రోజుల రిమాండ్.. చంచల్‌గూడ జైలుకు తరలింపు

**మద్యం రవాణా కేసులో కారుమూరికి జ్యుడిషియల్ కస్టడీ**
**14 రోజుల రిమాండ్ విధించిన నాంపల్లి కోర్టు**
**హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలింపు**
**మద్యం రవాణా కేసులో ఈడీ అదుపులోకి తీసుకున్న వైనం**
**ఆదివారం రాత్రి అరెస్ట్, సోమవారం కోర్టులో హాజరు**
**గత ప్రభుత్వ మద్యం విధానంలో అక్రమాలపై దర్యాప్తు**



**రాజదాని వాయిస్ హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, వైసీపీ నేత కారు మూరి నాగేశ్వరరావుకు నాంపల్లి కోర్టు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు సోమవారం ఉదయం ఆయన్ను హైదరాబా ద్‌లోని చంచల్‌గూ డ జైలుకు తరలించారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం రవాణా విధానంలో చోటుచేసుకున్న అక్రమాలకు సంబంధించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆయన్ను అరెస్ట్ చేసిన విష యం తెలిసిందే. మద్యం రవాణా కేసులో విచారణ నిమిత్తం కారుమూరి నాగేశ్వరరావును ఈడీ అధికారులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. విచారణ అనంతరం ఆదివారం రాత్రి ఆయన్ను అరెస్ట్ చేశారు. అరెస్టుకు ముందు ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆ తర్వాత ఈడీ కార్యాలయానికి తరలించారు. సోమవారం ఉదయం కోర్టులో హాజరుప రిచారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, కారుమూ రికి 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వుల అనంతరం, పోలీసు లు కారుమూరి నాగేశ్వరరా వును చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలిం చారు. గత ఏపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం వ్యాపార కార్యకలాపాల్లో జరిగిన అవకతవకలపై ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఈ కేసులో కారుమూరి నాగేశ్వ రరావును నిందితుడిగా పేర్కొన్నారు. ఆయన రిమాం డ్‌తో ఈ కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది.

## అమరావతికి 10.90 ఎకరాల భూమి సమీకరణ



**రాజదాని వాయిస్ రాయపూడి, ఆగస్టు 24:** ప్రజారాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్) కింద కురగల్లు గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు 10.90 ఎకరాల భూమిని స్వచ్ఛందంగా అందజేశారు. ఈ మేరకు తమ సమ్మతిని తెలియజేస్తూ సంబంధిత అంగీకార పత్రాలను సోమవారం రాయపూడిలోని-సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ కొల్లాబత్తుల కార్తీక్, ఐఏఎస్‌కు అందజేశారు. కురగల్లు గ్రామ పరిధిలోని 10.90 ఎకరాల భూమిని రాజధాని నిర్మాణానికి అందించేందుకు రైతులు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో కురగల్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి. కృష్ణారావు పాల్గొన్నారు. రాజ ధాని అమరావతి నిర్మాణంలో భాగస్వాములు కావడం సంతో షంగా ఉందని రైతులు తెలిపారు. రాజధాని గ్రామాల ప్రజలు ల్యాండ్ పూలింగ్ ప్రక్రియకు APCRDA అధికా రులకు సహకరించాలని వారు కోరారు.

భూములు అందజేసిన రైతులు:
దండా వీరారెడ్డి -- 2.90 ఎకరాలు
జంగా శ్రీనివాసరెడ్డి -- 8 ఎకరాలు
మొత్తం -- 10.90 ఎకరాలు

## విజయ్ నిర్ణయం.. ఇతర రాష్ట్రాలకు జాక్‌పాట్: ఎంకే స్టాలిన్

తమిళనాడులోని పరందూర్‌లో కొత్తగా నిర్మించతలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ ప్రాజెక్టును ముఖ్యమంత్రి విజయ్ పక్కనపెట్టడాన్ని డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్ ఖండించారు. ఆ ప్రాజెక్టు కోసం భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని గుర్తుచేస్తూ.. సంకుచిత రాజకీయాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టలేమని ధ్వజమెత్తారు. డీఎంకే హయాంలో రూపొందించిన ఈ ప్రాజెక్టు ప్రతిపాదనను తిరస్కరించడాన్ని.. రాష్ట్ర అభివృద్ధికి కోలుకోలేని ఎదురుదెబ్బగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయం.. పోటీ రాష్ట్రాలకు జాక్‌పాట్ లాంటిదేనని వ్యాఖ్యానిం చారు. "పరందూర్ విమానాశ్రయం విషయంలో దూరదృష్టి, ప్రణాళిక, సంప్రదింపులు లేకుండా తీసుకున్న నిర్ణయం రాష్ట్ర అభివృద్ధిని కొన్నేళ్లు వెనక్కి నెట్టేస్తుంది. యువత ఉపాధి కలలను దెబ్బతీస్తుంది. అసెంబ్లీలో చర్చకు అవకాశం ఇవ్వకుండా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఆందోళ నకరం. ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల నుంచి ఆటోమొబైల్స్ వరకు అన్ని రంగాల్లో ముందున్న తమిళనాడుకు ఈ విమానాశ్రయం ఎంతో అవసరం. అన్ని ప్రత్యామ్నాయాలను విశ్లేషించిన అనంతరమే పరందూర్ ప్రాంతాన్ని ఎంపిక చేశాం. మరోసారి అధికారంలోకి వచ్చాక పనులను వేగవంతం చేయాలని ప్రణాళికలు రూపొందించాం. ఇప్పుడు కొత్త ప్రభు త్వం మళ్లీ మొదటినుంచి ఈ ప్రక్రియ ప్రారంభిస్తే.. రాష్ట్ర అభివృద్ధి కుంటుపడుతుంది' అని స్టాలిన్ విమర్శించారు. పరందూర్ విమా నాశ్రయ ప్రాజెక్టును విరమించుకుంటున్నట్లు అంతకుముందు సీఎం విజయ్ అసెంబ్లీలో ప్రకటించారు. అభివృద్ధికి తమ ప్రభుత్వం వ్యతిరే కం కాదని పేర్కొంటూ.. ఈ ఎయిర్‌పోర్టు కోసం ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తిస్తామని తెలిపారు. "ఈ ప్రాజెక్టు కోసం ఎంపిక చేసిన ప్రాంతంలో దాదాపు 55 శాతం జలాశయాలు, చిత్తడి నేలలతో నిండి ఉంది. దీనివల్ల రన్‌వే కార్యకలాపాలపై ప్రభావం పడుతుంది.

## ముసునూరు విజయగాథగా నిలిచింది





పాప్‌కార్న్ బహుకరించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ తర్వాత ఉపరాష్ట్రపతి భవన్‌లో జరిగిన సమావేశంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో పాటు ఇతరులకు కూడా ఆ పాప్‌కార్న్ అందించినట్లు తెలిపారు. భారత రైతుల సామర్థ్యాన్ని, వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యతను ప్రపంచానికి చాటిచెప్పే ఉదాహరణగా ఈ సంఘటనను ప్రస్తావించినట్లు చెప్పారు. రైతు సంకల్పం, సాంకేతికత, పరిశ్రమ కలిస్తే ప్రపంచ మార్కెట్లను సైతం ఆకర్షించగలమని పేర్కొన్నారు. రైతులే దేశానికి వెన్నెముక అని ఉపరాష్ట్రపతి పునరుద్ఘాటించారు. దేశ ఆర్థికాభివృద్ధి, సంస్కృతి, సంప్రదాయాలు అన్నీ వ్యవసాయంతో ముడిపడి ఉన్నాయని వివరించారు. సంక్రాంతి, పొంగల్, లోహ్రీ, బిహూ వంటి పంటల పండుగలు దేశ వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తూనే వ్యవసాయం భారతదేశాన్ని ఏకం చేస్తోందని చెప్పారు. స్థూల విలువ జోడింపులో వ్యవసాయం, అనుబంధ రంగాల వాటా ఇప్పటికీ అత్యంత కీలకమని గుర్తుచేశారు. కార్యక్రమంలో గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, కోర్టెవా పాప్‌కార్నికా సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి కలిసి కొత్త పాప్‌కార్న్ వంగడాన్ని ఆవిష్కరించి, వ్యవసాయ రంగంలో విశేష కృషి చేసిన పలువురు రైతులను సత్కరించారు.

## పులివెందుల తాగునీటి పథకానికి ఊపిరి



ఈ మెగా ప్రాజెక్టును ప్రారంభించారు. అయితే గత ప్రభుత్వ హయాంలో పనులు ఆశిం చిన స్థాయిలో సాగకపోవడంతో ప్రాజెక్టు పురోగతి మందగించింది. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టును ప్రాధాన్య అంశంగా గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టింది. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జల్ జీవన్ మిషన్ కింద నిలిచిపోయిన పనులను తిరిగి గాడిలో పెట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం నుంచి లభించిన అవకాశాలను వినియోగించుకుని ప్రాజెక్టు పూర్తి కోసం అవసరమైన నిధులు సమకూర్చారు. దాదాపు రూ. 280 కోట్లు ఈ పథకానికే కేటాయించి పనులను వేగవంతం చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టుకు సంబంధించిన మొత్తం పనుల్లో 96 శాతం పూర్తయ్యాయి. 1,111 కిలోమీటర్ల పైప్‌లైన్‌లో 1,106 కిలోమీటర్ల నిర్మాణం పూర్తి చేశారు. పులివెందుల పట్టణం, పులివెందుల గ్రామీణ ప్రాంతం, సింహాద్రిపురం మండలాల్లో పనులు పూర్తవడంతో తాగునీటి సరఫరా అందుబాటులోకి వచ్చింది. లింగాల మండలంలోని 27 ఆవాసాల్లో 24 ఆవాసాలకు కూడా త్వరలో తాగునీటి సరఫరా ప్రారంభం కానుంది. ప్రాజెక్టులో కీలకమైన ఇంటేక్ వెల్ పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయి. 65 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి కేంద్రాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఓవర్ హెడ్ ట్యాంకులు, గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్ల నిర్మాణ పనులు కూడా తుది దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం నీటి శుద్ధి కేంద్రాలకు సంబంధించిన కొన్ని తుది పనులు మాత్రమే మిగిలి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రజల ప్రాథమిక అవసరాలైన తాగునీరు, పారిశుద్ధ్య రంగాలకు రాజకీయాలకు అతీతంగా ప్రాధాన్యం ఇవ్వాలన్న ప్రభుత్వ సంకల్పంతో ఈ పనులు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే లక్షలాది మంది ప్రజలకు శాశ్వత తాగునీటి భరోసా లభించనుందని, ప్రాంత అభివృద్ధికి కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.

## వచ్చే ఎన్నికల్లో ఆలేరు బరిలో తీన్మార్ మల్లన్న

సంధించగా, వాటికి మల్లన్న సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ నేటి రాజకీయ నాయకులు ప్రశ్నించే యువతను చూసి భయపడుతున్నారని అన్నారు. సామాజిక మాధ్యమాల ప్రభావంతో నేటి యువత దేశ రాజకీయ దిశను మార్చగల శక్తిగా ఎదుగుతోందని పేర్కొన్నారు. యువత అన్యాయాలపై గళమెత్తాలని, ప్రజా సమస్యలపై చైతన్యవంతంగా ఉండాలని పిలుపునిచ్చారు. విద్యా రంగంపై మాట్లాడిన తీన్మార్ మల్లన్న, విద్య మరియు వైద్య రంగాలకు కలిపి రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 40 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మొదటి తరగతి నుంచి ఉన్నత విద్య వరకు ప్రతి విద్యార్థికి పూర్తిగా ఉచిత విద్య అందించడమే తమ పార్టీ విధానమని ప్రకటించారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీపై పోరాటం కొనసాగిస్తామని, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రిజర్వేషన్ల అంశంపై స్పందిస్తూ సమాజంలో కుల వివక్ష కొనసాగుతు న్నంతకాలం రిజర్వేషన్లు అవసరమేనని స్పష్టం చేశారు. రిజర్వేషన్లు తొలగించాలనే వారు ముందుగా కుల వ్యవస్థ నిర్మూలన కోసం పోరాడాలని సూచించారు. అలాగే విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు భారీగా పెండింగ్‌లో ఉన్నాయని, ఈ అంశాన్ని అసెంబ్లీలో బలంగా ప్రస్తావిస్తానని తెలిపారు. విద్యార్థుల సమస్యలపై స్పందిస్తూ పాలిటెక్నిక్, ఐటీఐ విద్యార్థుల ఉద్యమాలకు పూర్తి మద్దతు ప్రకటించారు. సరైన మౌలిక సదుపాయాలు లేకుండా విద్యాసంస్థలను విలీనం చేయడం సరైంది కాదని అన్నారు. ఆర్‌టీఈ చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లు కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని చెప్పారు. రాజకీయంగా కీలక ప్రకటనలు చేసిన తీన్మార్ మల్లన్న, 2028 ఎన్నికల్లో ఆలేరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని వెల్లడించారు. అలాగే సెప్టెంబర్ 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 14 వేల కిలోమీటర్ల పాదయాత్ర చేపడతామని ప్రకటించారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎన్నికల గుర్తు "కత్తెర" అని గుర్తు చేస్తూ, ప్రజా వ్యతిరేక విధానాలను ఎదుర్కొనేందుకే ఆ గుర్తును ఎంచుకున్నామని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ అవార్డులు అందజేశారు.

## ఐడీఎల్ భూములపై ఈటల ప్రశ్నలు

**రాజదాని వాయిస్ హైదరాబాద్, ఆగస్టు 24 :** ఐడీఎల్ భూముల వ్యవహారంపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఐడీఎల్ ప్రాంతంలో హానర్ హోమ్స్ పేరుతో నిర్మిస్తున్న అపార్ట్మెంట్లలో ఒక్కో నివాస యూనిట్ భారీ ధరలకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో జరిగిన భూముల కేటాయింపులపై స్పందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఈ అంశంపై ఎందుకు మౌనం పాటిస్తోందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో భూముల కేటాయింపులపై సమగ్ర విచారణ జరుపుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే హానర్ హోమ్స్ వ్యవహారంపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు కనిపించడం లేదని విమర్శించారు. దీనిపై విచారణ ఎందుకు జరపడం లేదని, అవసరమైతే చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సంబంధిత భూముల కేటాయింపులపై పూర్తి వివరాలు ప్రజలకు వెల్లడించాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. అక్రమాలు జరిగి ఉంటే భూములను తిరిగి స్వాధీనం చేసుకునే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా జరిగే నిర్ణయాలను అడ్డుకో వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్రానికి భారీ ఆదాయం వచ్చేలా భూముల నిర్వహణలో పారదర్శక విధానాలు అమలు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ భూముల విలువను కాపాడుతూ ప్రజలకు ప్రయోజనం చేకూరే నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ప్రజా ఆస్తుల విషయంలో ఎలాంటి సందేహాలకు తావు లేకుండా వ్యవహరించాలని సూచించారు. అర్బన్ సీలింగ్ పరిధిలోని భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలు నిలిపివేయాలని కూడా డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తి అని, వాటి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు అవసరమని పేర్కొన్నారు.

## బీసీ కులగణనతోనే సామాజిక న్యాయం

**హైదరాబాద్, ఆగస్టు 24 :** బీసీల కులగణన చేపట్టిన ప్పుడే వెనుకబడిన వర్గాలకు నిజమైన న్యాయం జరుగుతుందని పలువురు నేతలు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదన చారి, బీసీ ఇంటలెక్టువల్స్ ఫోరమ్ కన్వీనర్ చిరంజీవులు, ప్రభుత్వ సలహాదారు వి. హనుమ ంతరావు, బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, గుజ్జ కృష్ణ, కోల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ దేశంలోని కోట్లాది బీసీల ఆత్మగౌరవానికి కులగణ న అంశం ముడిపడి ఉందన్నారు. సమాజంలో బీసీల వాస్తవ జనాభా, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన సమాచారం వెలుగులోకి రావాలంటే సమగ్ర కులగణన అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అంశంపై ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. చరిత్రలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, పండుగ సాయన్న, చాకలి ఐలమ్మ, కొమరం భీమ్ వంటి మహనీయులు సామాజిక హక్కుల కోసం పోరాటాలు చేశారని గుర్తు చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే ఆలోచనల ద్వారా వెనుకబడిన వర్గాల చరిత్ర, వారి సమస్యలను సమాజం తెలుసుకుందని పేర్కొన్నారు. బీసీల ఐక్యత ద్వారానే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని అభిప్రాయప డ్డారు. కులాల పేరుతో సమాజా న్ని విభజించి కొన్ని వర్గాలను అధికారానికి దూరంగా ఉంచే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఇలాంటి పరిస్థితులు కొనసాగకుండా బీసీలంతా ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా వెనుకబడిన వర్గాల హక్కుల కోసం అందరూ ఒకే వేదికపైకి రావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే బీసీ కుటుంబాల వివరాలను కూడా పూర్తిస్థాయిలో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వివిధ రాష్ట్రాల్లో ఒకే వర్గానికి భిన్న పేర్లు ఉండటం వల్ల గణనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అయినప్పటికీ సమగ్ర కులగ ణన నిర్వహించి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలకు రాజ్యాధికారంలో వాటా, చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించే వారికే తమ మద్దతు ఉంటుందని నేతలు స్పష్టం చేశారు. సాయుధ పోరాటం, తెలంగాణ ఉద్యమం సహా పలు సామాజిక ఉద్యమాల్లో బీసీలు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు.

## ఫుడ్ ప్రాసెసింగ్‌తో పంటలకు విలువ.. ప్రపంచ మార్కెట్లే లక్ష్యం: సీఎం చంద్రబాబు




ప్రపంచ ప్రసిద్ధి చెందిన బ్రాండ్లుగా మారాలి. రైల్వే స్టేషన్లలోనూ వీటి కౌంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. కొండపల్లి కొయ్యబొమ్మల వంటి స్వదేశీ ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు చేరాలి. కేంద్ర, రాష్ట్రాల్లోని ఎన్డీఏ ప్రభుత్వాలు వ్యవసాయాన్ని ఆర్థిక శక్తిగా, రైతులను పారిశ్రామి కవేత్తలుగా చూస్తున్నాయి. పసుపు, మిరప, ఆక్వా ఉత్పత్తులకు విలువ జోడించి ఎగుమతి చేయడమే మా లక్ష్యం" అని చంద్రబాబు వివరించారు.

ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 10 శాతం ఉత్పత్తులు మాత్రమే ప్రాసెస్ అవుతున్నాయని, ఈ శాతాన్ని పెంచడం ద్వారా అధిక సంపదను ఆర్జించవచ్చని అన్నారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలని, ముఖ్యంగా యువత ఈ రంగంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

**రాష్ట్ర సమగ్రాభివృద్ధికి జల భద్రతే కీలకం**

రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికల గురించి వివరిస్తూ.. "రాయలసీమను ఉద్యాన పంటల హబ్‌గా మార్చేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులతో సీమను అభివృద్ధి చేస్తాం. రూ.35 వేల కోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తాం" అని చంద్రబాబు హామీ ఇచ్చారు.

ఈ నెలాఖరులో వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు నీరందిస్తా మన్నారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు తరలించి పంటలను కాపాడామని గుర్తుచేశారు. చింతలపూడి ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంత భవిష్యత్తు మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా నదుల అనుసంధనం జరగాలన్నది ఎన్డీఏ ప్రభుత్వ ఆలోచన అని ముఖ్యమంత్రి తెలిపారు. "గోదావరి-కృష్ణా, తుంగభద్ర, పెన్నా-కావేరీ నదుల అనుసం ధానంతో 4 రాష్ట్రాల్లో నీటి సమస్యలు తీరతాయి. గంగ, మహానది, గోదావరి నదులను కూడా కలిపితే వేల టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకోవచ్చు. నీటి భద్రత సాధిస్తే దేశాభివృద్ధి అన్‌స్టాపబుల్" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, కె. అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి, పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## సీఎం విజయ్ సంచలన ప్రకటన..

సీఎం విజయ్ ప్రకటించారు. 'అన్నపూర్ణి సూపర్ సిక్స్' పథకం కింద దీనిని అమలు చేయనున్నట్లు సీఎం విజయ్ పేర్కొన్నారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు నేరుగా జమ అయ్యేలా పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ఉచిత ఎల్‌పీజీ సిలిండర్ల పథకాన్ని వచ్చే ఏడాది పొంగల్ పండుగ నుంచి అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ పథకం కింద సుమారు 1.30 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. అలాగే రాష్ట్ర ఖజానాపై ఏడాదికి సుమారు రూ.4,000 కోట్ల వ్యయం పడనుంది. మహిళలు, ట్రాన్స్‌జెండర్ల కోసం ఉచిత బస్సు ప్రయాణాన్ని మరింత విస్తరిస్తూ 'వెట్రి పయన తిట్టం' పథకాన్నీ సీఎం విజయ్ ప్రకటించారు. ఈ పథకం ద్వారా ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రకటించడంతో పాటు మహిళల కోసం దీని పరిధిని విస్తరించారు. ఇకపై ఎక్స్‌ప్రెస్, లిమిటెడ్ స్టాప్ సర్వీస్, డీలక్స్ సర్వీసుల బస్సుల్లోనూ మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించనున్నారు. ఉచిత ప్రయాణం పొందేందుకు ఆదాయ పరిమితి, ప్రయాణాల సంఖ్యపై ఎలాంటి నిబంధనలు ఉండవని సీఎం స్పష్టం చేశారు. కాగా, గాంధీ జయంతి రోజైన అక్టోబర్ 2 నుంచి ఈ పథకం అమల్లోకి రానుందని తెలిపారు. అలాగే, అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ మరో సంచలన నిర్ణయం ప్రకటించారు. చెన్నై శివార్లలోని పరందూర్‌లో రెండో విమానాశ్రయం నిర్మించాలన్న ప్రతిపాదనను తమ ప్రభుత్వం విరమించుకుంటున్నట్లు తెలిపారు. విమానాశ్రయాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేస్తున్న వారికి తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. 'పరందూర్ విమానాశ్రయ ప్రాజెక్టును విరమించుకుంటున్నాం. ప్రతిపాదిత విమానాశ్ర యానికి వ్యతిరేకంగా పోరాడుతున్న నిరసనకారులకు నేను అండగా ఉంటా' అని విజయ్ పేర్కొన్నారు.

## అంజయ్యనగర్‌లో ప్రమాదకర భవనాల తొలగింపు

**రాజదాని వాయిస్ హైదరాబాద్, ఆగస్టు 24 :** శేరిలింగంపల్లి మండలం అంజయ్యనగర్‌లో ప్రమాదకరంగా మారిన భవనాల తొలగింపు పనులు కొనసాగుతున్నాయని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. ఎప్పుడు ఏ భవనం కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొన్నందున ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్‌తో కలిసి సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. అంజయ్యనగర్‌లో ఇటీవల ఏడు అంతస్తుల భవనం కుప్పకూలిన ఘటన అనంతరం పక్కనే ఉన్న మరో భవనం కూడా ప్రమాదకరంగా మారినట్లు అధికారులు గుర్తించారు. దీంతో సీఎంసీ, హైడ్రా సంయుక్త ఆధ్వర్యంలో దెబ్బతిన్న భవనాల తొలగింపు పనులను ప్రారంభించారు. ఆదివారం ప్రారంభమైన ఈ పనులు సోమవారం కూడా కొనసాగాయి. స్థానికుల ఫిర్యాదుల మేరకు పరిసర ప్రాంతాల్లోని మరికొన్ని భవనాలను కూడా అధికారులు పరిశీలించారు. వాటిలో కొన్ని నిర్మాణాలు సైతం ప్రమాదకర స్థితిలో ఉన్నట్లు గుర్తించి తగిన చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. వరద కాలువలను కొంత మేర ఆక్రమించి చిన్న స్థలాల్లో భారీ నిర్మాణాలు చేపట్టడం వల్లే భవనాల పటిష్టత దెబ్బతిన్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. సుమారు 50 గజాల స్థలంలో రెండు అంతస్తులకు మాత్రమే అనుమతులు తీసుకుని, ఆ మేరకే పునాదులు, పిల్లర్లు నిర్మించి అనంతరం ఏడు నుంచి ఎనిమిది అంతస్తుల వరకు నిర్మాణాలు చేపట్టడం వల్ల భవనాల భద్రత దెబ్బతిన్నదని వివరించారు. అనుమతులు లేకుండా, నిర్మాణ నిబంధనలను ఉల్లంఘించి నిర్మించిన భవనాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. అయితే ప్రమాదకర భవనాలను తొలగించే సమయంలో పక్కనే ఉన్న అపార్టుమెంట్లు, ఇతర నిర్మాణాలకు ఎలాంటి నష్టం కలగకుండా అత్యంత జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. సాంకేతిక నిపుణుల సూచనల మేరకు పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. భవనాల తొలగింపు ప్రక్రియలో భద్రతా ప్రమాణాలు పాటించడం వల్ల కొంత జాప్యం జరుగుతోందని అధికారులు తెలిపారు. ముందస్తుగా పరిసర ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు పేర్కొన్నారు. ప్రమాదం ముప్పు పూర్తిగా తొలగే వరకు పర్యవేక్షణ కొనసాగుతుందని, ప్రజలు అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# తాళ్లూరుకు నూతన విద్యుత్ సబ్‌స్టేషన్

- విద్యుత్ సరఫరా మెరుగుదలకు కీలక అడుగు
- ప్రజలకు నాణ్యమైన సేవలే లక్ష్యం
- మంత్రితో కలిసి ప్రారంభించిన లక్ష్మీ
- పరిసర ప్రాంతాలకు నిరంతర విద్యుత్ హామీ







**రాజదాని వాయిస్ ప్రకాశం జిల్లా :** తాళ్లూరు మండల అభివృద్ధికి మరో కీలక ముందడుగుగా నూతన 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ కలిసి ఈ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా తాళ్లూరు మండలంతో పాటు పరిసర ప్రాంతాలకు మెరుగైన విద్యుత్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. దీని ద్వారా విద్యుత్ ఒత్తిడి తగ్గడంతో పాటు అంతరాయాలు తగ్గి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందే అవకాశం ఉందన్నారు. వ్యవసాయం, గృహ, వాణిజ్య అవసరాలకు కూడా ఇది ఎంతో ఉపయోగపడనుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా విద్యుత్ రంగంలో మరిన్ని ప్రాజెక్టులు చేపట్టనున్నట్లు నాయకులు తెలిపారు. విద్యుత్ మౌలిక వసతుల బలోపేతం ద్వారా పరిశ్రమలు, వ్యాపార కార్యకలాపాలు, వ్యవసాయ రంగానికి ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సబ్‌స్టేషన్ ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో డాక్టర్ కడియాల లలిత్ సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి–సుబ్బారావు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, తాళ్లూరు మండల ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే విద్యుత్ శాఖ అధికారులు, తెలుగు దేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సబ్‌స్టేషన్ ప్రారంభంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేయగా, విద్యుత్ సేవల మెరుగుదలతో ప్రాంత అభివృద్ధికి కొత్త ఊపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# అమరావతి ఛాంపియన్‌షిప్‌కు ఘన శ్రీకారం

- మంత్రి అనిత చేతుల మీదుగా పోటీల ప్రారంభం
- 26 జిల్లాల నుంచి 9 వేల మంది క్రీడాకారులు
- ప్రతిభావంతులను వెలికితీయడమే లక్ష్యం
- ఒలింపిక్స్ స్థాయికి క్రీడాకారులను తీర్చిదిద్దే సంకల్పం









**రాజదాని వాయిస్ తిరుపతి, ఆగస్టు 24 :** తిరుపతిలో అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ఘనంగా ప్రారంభించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి అండర్–17, అండర్–23 విభాగాలకు చెందిన 9 వేల మందికి పైగా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికితీయడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు, పాఠశాలల స్థాయిలో దాగి ఉన్న ప్రతిభావం తులను గుర్తించి వారికి సరైన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. క్రీడాకారుల సామర్థ్యాలను రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అనిత పేర్కొన్నారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక బలాన్ని కూడా క్రీడలు అందిస్తాయని చెప్పారు. ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని ఆమె తెలిపారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభావంతులను గుర్తించి వారికి శిక్షణ, సదుపాయాలు, పోటీల్లో పాల్గొనే అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. క్రీడా రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని చెప్పా రు. ఈ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారుల్లో కనీసం 20 శాతం మంది భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించాలని ఆకాంక్షిస్తున్నట్లు అనిత పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించే క్రీడాకారులను తీర్చిదిద్దేం దుకు ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు. అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీలు యువ క్రీడాకారులకు తమ ప్రతిభను నిరూపించుకునే వేదికగా నిలవనున్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వేలాది మంది క్రీడాకారులు వివిధ క్రీడాంశాల్లో పోటీపడనుండగా, ఈ పోటీలు భవిష్యత్తు ఛాంపియన్లను వెలికితీయడంలో కీలక పాత్ర పోషిస్తాయని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు భద్రతా సన్నాహాలు

- ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో సమీక్ష
- దుకాణదారులతో పోలీసుల సమావేశం
- భక్తులకు మెరుగైన సేవలపై చర్చ
- పోలీసు, విజిలెన్స్ విభాగాల సంయుక్త చర్యలు





**రాజదాని వాయిస్ తిరుమల :** రాబోయే శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలో భద్రతా, నిర్వహణ ఏర్పాట్లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు పోలీసు, విజిలెన్స్ శాఖల అధికారులు సంయుక్తంగా చర్యలు చేపడుతున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. బ్రహ్మోత్సవాల సమయంలో లక్షలాది మంది భక్తులు తిరుమలను సందర్శించే అవకాశం ఉండటం తో భద్రతా ఏర్పాట్లను మరింత బలోపేతం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తిరుమలలోని దుకాణదారులతో పోలీసు, విజిలెన్స్ అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు.సమావేశంలో దుకాణాల నిర్వహణ, ధరల ప్రదర్శన, పరిశుభ్రత, భక్తులతో మర్యాదపూర్వక వ్యవహారం వంటి అంశాలపై చర్చించారు. ఉత్సవాల సమయంలో ఎలాంటి అక్రమాలు, మోసపూరిత చర్యలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్పీ సుబ్బరాయుడు సూచనల మేరకు భద్రతా చర్యలను కట్టుదిట్టం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తిరుమలలో కీలక ప్రాంతాల్లో నిఘా పెంచడంతో పాటు భక్తుల రాకపోకలను సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.విజిలెన్స్ అధికారులు దుకాణదారులకు ఆలయ పరిసరాల్లో పాటించాల్సిన నిబంధనలను వివరించారు. అనధికార కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భక్తుల విశ్వాసాన్ని కాపాడే విధంగా వ్యాపారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసు, విజిలెన్స్, దేవస్థానం అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఉత్సవాల కాలంలో ఒక్కరూ సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# టీడీపీ ప్రజా వినతులకు స్పందన

- మంత్రి నారాయణకు 84 వినతులు - భూ వివాదాలే అధికంగా నమోదు -
అధికారులకు ఫిర్యాదుల పంపిణీ - త్వరిత పరిష్కారానికి చర్యలు



**రాజదాని వాయిస్ అమరావతి, ఆగస్టు 24 :** టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మంత్రుల ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి మొత్తం 84 వినతులు అందినట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. అందిన ఫిర్యాదుల్లో దాదాపు 90 శాతం భూ వివాదాలకు సంబంధించినవేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో పరిగణిస్తున్నదని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేశ్ ఆదేశాల మేరకు ప్రతి వినతిని సంబంధిత శాఖలకు పంపిస్తున్నామని తెలిపారు.అందిన ఫిర్యాదులను సంబంధిత జిల్లా కలెక్టర్లు, శాఖల అధికారులకు పంపించినట్లు మంత్రి వెల్లడించారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. వినతిదారులతో అధికారులు నేరుగా సంప్రదింపులు జరిపి సమస్యల స్వరూపాన్ని తెలుసుకుంటారని తెలిపారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ యంత్రాంగం ముందుండి సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.భూ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా రావడం గమనించామని, వాటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మంత్రి నారాయణ చెప్పారు. ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, వేగం, జవాబుదారీతనానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. అందిన ప్రతి వినతికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు

# వర్ల రామయ్యకు మంత్రి అభినందనలు

- టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వక భేటీ
- శాలువాతో సత్కరించిన పార్థసారథి
- ఎమ్మెల్సీ నియామకంపై హర్షం



**రాజదాని వాయిస్ మంగళగిరి, ఆగస్టు 24 :** ఇటీవల గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమితులైన వర్ల రామయ్యను రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. వర్ల రామయ్యకు ఎమ్మెల్సీ పదవి దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేసిన మంత్రి పార్థసారథి, ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, ప్రజా సేవకు ఆయన అందిస్తున్న సేవలను కొనియాడారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక కావడం ఆయన ప్రజా జీవితం, రాజకీయ ప్రస్థానానికి గుర్తింపుగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో మరింత చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై కూడా చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వర్ల రామయ్య కూడా తనపై నమ్మకం ఉంచి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తానని చెప్పారు. ఈ భేటీ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వర్ల రామయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా ఆయన నియామకంపై పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేశాయి.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి పోలీసుల ప్రత్యేక వేదిక



**రాజదాని వాయిస్ విజయవాడ, ఆగస్టు 24:** ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించే లక్ష్యంతో ఎన్‌టీఆర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు ఆదేశాల మేరకు డీసీపీ ఎ.బి.టి.ఎస్. ఉదయారాణి నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. భూవివాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక మోసాలు, ఇతర సామాజిక సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను అధికారులు స్వీకరించి సంబంధిత వివరాలను నమోదు చేశారు.మొత్తం 94 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత పోలీసు స్టేషన్లు, విభాగాలకు పంపించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. బాధితులకు న్యాయం జరిగేలా అన్ని విధాలుగా సహకరిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకోవడం ద్వారా వాటి పరిష్కార ప్రక్రియ వేగవంతం అవుతుందని అధికారులు పేర్కొన్నారు. పోలీసు శాఖపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడుతున్నాయని తెలిపారు.ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరగకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అర్జీల స్థితిగతులను నిరంతరం సమీక్షిస్తూ బాధితులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆదేశించారు. ప్రజలకు చేరువైన పోలీసింగ్ లక్ష్యంగా ఎన్‌టీఆర్ జిల్లా పోలీసు శాఖ పనిచేస్తోందని అధికారులు తెలిపారు. ప్రజల సమస్యలకు సత్వర స్పందన, పారదర్శక పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ ఇలాంటి ప్రజా సమస్యల పరిష్కార వేదికలను కొనసాగిస్తామని వెల్లడించారు.

## సిఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి



**రాజుపాలెం.ఆగస్టు 24,రాజధాని వాయిస్ :** మండలంలోని ఉప్పలపాడు గ్రామం నందు 2ఏళ్ల నమ్మకం సంక్షేమం అభివృద్ధి ఇంటింటి ప్రచార కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు,సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యుడు కన్నా లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన రెండు ఏళ్ళలో కూటమి ఇచ్చిన హామీలను 90 శాతం అమలు చేసి చూపించామని, ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం మరింతగా అభివృద్ధి చేందుతుందన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా , నియోజకవర్గ, పట్టణ వార్డు కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులుపాల్గొన్నారు.

## శ్రీ సిమెంట్ మైనింగ్ కార్యకలాపాలు నిలిపివేయాలి

**- కాచవరం గ్రామస్తుల ఆందోళన**





**కారంపూడి.ఆగస్టు 24రాజధాని వాయిస్ :**శ్రీ సిమెంట్ కర్మాగారం మైనింగ్ కార్యకలాపాలను నిలిపివేయాలని మండలంలోని కాచవరం గ్రామస్తులు సోమవారం మైనింగ్ వద్ద ఆందోళనకు దిగారు. శ్రీ సిమెంట్ యాజమాన్యం మొండి వైఖరిని విన్నాడాలని అన్నారు. ఫ్యాక్టరీ మైనింగ్ తో గృహాలు దెబ్బతింటున్నాయని గ్రామస్తులు తెలిపారు.ఫ్యాక్టరీ నుండి మా గ్రామాన్ని కాపాడాలని వారుఅన్నారు.గ్రామస్తులు ఆందోళనకు దిగడంతో తహశీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, ఆర్ ఐ వేముల శ్రీనివాసరావు ఆప్రాంతానికి చేరుకున్నారు.యాజమాన్యానికి, గ్రామస్తులకు ఎలాంటి వివాదం లేకుండా చూసుకోవాలని అన్నారు. గ్రామస్తులు తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీని తహశీల్దార్ కు అందజేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను సానుకూలంగా పరిష్కారం అయ్యే విధంగా చూస్తామని తెలపటంతో గ్రామస్తులు ఆందోళన విరమించుకున్నారు.

**గ్రామానికి అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ లక్ష్మీనారాయణ**

కాచవరం గ్రామానికి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని , వారి కోరిన హామీలు కొన్ని నెరవేర్చామని శ్రీ సిమెంట్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ లక్ష్మీనారాయణ అన్నారు. గ్రామ అభివృద్ధికి సకరించామని, ముగ్గురు వ్యక్తులకు కూడా ఉద్యోగాలు కల్పించి పర్మినెంట్ చేయడం జరిగిందని తెలిపారు. అర్హత ఉన్నవారికి ఉద్యోగాలు కల్పిస్తామని యాజమాన్యానికి కొంత సమయం కావాలని ఆయన అన్నారు.

## అర్జీలను గడువులోగా పరిష్కరించాలి జేసీ సంజనా సింహా




**నరసరావుపేట.ఆగస్టు 24రాజధాని వాయిస్ :**ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చే అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్ణీత గడువులోగా సంతృప్తికరంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సంజనా సింహా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్ సమీక్షలో ఆమె మాట్లాడారు.?అర్జీల పరిష్కారంపై ప్రభుత్వం ఫీడ్‌బ్యాక్ తీసుకుంటోందని, సమస్యను పూర్తిస్థాయిలో తెలుసుకోకుండా నామమాత్రంగా ఆన్‌లైన్‌లో క్లోజ్ చేయడం సరికాదన్నారు. ముఖ్యంగా ల్యాండ్ కరెక్షన్, 22-ఎ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అర్జీదారుల సంతృప్తి శాతాన్ని పెంచేందుకు అధికారులు మరింత బాధ్యతగా పనిచేయాలని నోడల్ అధికారి లీలారాణి కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో అద్దయ్య, ఆర్డీవోలు బాలకృష్ణ, గోపాలకృష్ణ, మురళీకృష్ణ, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్న కారంపూడి

**వామ్మో దోమలతో అల్లాడిపోతున్నాం**

**నాలుగు రోజుల నుండి విధులకు బహిష్కరించిన పారిశుద్ధ్య కార్మికులు**





**కారంపూడి. ఆగస్టు 24 రాజదాని వాయిస్ :** మండల కేంద్రమైన కారంపూడిలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. డంపింగ్ యార్డ్ గా తలపిస్తున్న ప్రధాన వీధులు, దేవాలయాలు, ముఖ్య కోడలు, బస్టాండ్ సెంటర్లో ఎక్కడి చెత్త అక్కడే ఉంది. మురికి కాలువలలో మురుగు నీరు నిల్వ చేరింది.గత రెండు రోజులు ఉండి కురుస్తున్న వర్షాలకు చెత్తాచెదారం నుండి దుర్వాసన వెదజల్లుతుంది. వర్షపు నీరు మురికి కాలువలో చేరడంతో మురుగనీరు రోడ్లపై పారుతుంది. పారిశుద్ధ్య కార్మికులు తమ జీతాలు చెల్లించాలని గత నాలుగు రోజులు నుండి విధులకు బహిష్కరించారు.16 నెలల జీతాలు చెల్లించాలని గతంలో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లాకు తెలిపారు. స్పందించిన ఆమె విచారణ చేసి జీతాలు చెల్లించాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి కారంపూడి విచ్చేసి పారిశుధ్య కార్మికులతో చర్చించారు.తక్షణమే పారిశుధ్య కార్మికులకు బ్యాంకు ఖాతాలు ఏర్పాటుచేసి వారి ఖాతాలో జీతాలు చెల్లించే విధంగా చూడాలని జులై 27వ తేదీన పంచాయతీ అధికారులను ఆదేశించారు. అధికారులు జీతాలు చెల్లించకపోవడంతో ఆగస్టు 10వ తేదీన సమ్మె నోటీసును పంచాయతీ విస్తరణ అధికారి శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు. ఆగస్టు 15వ తేదీన బస్టాండ్ సెంటర్లో సమ్మెకు దిగారు. అధికారులు పారిశుధ్య కార్మికులతో చర్చించి మూడు నెలల జీతాలు ఇచ్చే విధంగా ఒప్పందం కుదిరింది. ఈనెల 19వ తేదీన జీతాలు చెల్లించకపోవడంతో 21వ తేదీ నుండి కార్మికులు సమ్మె బాట పడ్డారు.పరిశుద్ధ కార్మికులు విధుకురాక పోవడంతో పట్టణం పారిశుధ్యం లోపించినట్లు అయింది.

**దోమలు విలయతాండవం**

పారిశుద్ధ్య కార్మికులు గత నాలుగు రోజులుగా విధుల్లోకి రాకపోవడంతో మురికి కాల్వలో మురుగనీరు నిల్వ చేరింది. దీంతో దోమలు భలే తాండవం చేస్తున్నాయి.రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వర్షపు నీరు మురుగు కాలవలో చేరి దుర్వాసనతో, దోమల బారిన పడవలసి వస్తుందని పట్టణ వాసులు అంటున్నారు.తక్షణమే అధికారులు స్పందించి పారిశుద్ధ కార్మికులకు జీతాలు చెల్లించాలని. వీధుల్లోకి కార్మికులు రావాలని ప్రజల కోరుకుంటున్నారు.

# పురాతన ఆలయాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**- టీడీపీ యువ నేత గౌతమ్ జూలకంటి**



**వెల్దుర్తి.ఆగస్టు 24 రాజధాని వాయిస్ :**మాచర్ల నియోజకవర్గ పరిధిలో పల్నాడు ప్రాచీన చరిత్రకు ఆనవాళ్లుగా విరాజిల్లుతున్న పురాతన ఆలయాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయుడు, టీడీపీ యువ నేత గౌతమ్ జూలకంటి చెప్పారు. సోమవారం మండల పరిధిలోని లోయపల్లి గ్రామంలో పర్యటించిన ఆయన, గ్రామ సివారులో కొలువుదీరిన స్వయంభూ శ్రీ బాల త్రిపుర సుందరి దేవి సమేత శ్రీ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు అనంతరం స్థానికులతో గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్వామి వారి ఆలయానికి రోడ్డు మార్గం ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు గౌతమ్ దృష్టికి తీసుకొచ్చారు. 800 ఏళ్ల ఘన చరిత్ర ఉన్న ఈ ఆలయం నల్లమల ఫారెస్ట్ లో ఉన్నందున, ఆటవి శాఖ అనుమతులు రోడ్డు నిర్మాణానికి అడ్డుగా మారాయని స్థానికులు వాపోయ్యారు. కనీసం గ్రావెల రోడ్డుకైనా అనుమతులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వినతులపై స్పందించిన గౌతమ్.. తప్పనిసరిగా ఆలయానికి పోవు రోడ్డు మార్గం నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కళ్లం రామాంజి రెడ్డి, ముండ్లమూరి కోటయ్య, గంట కృష్ణమూర్తి, ముప్పాళ్ల శ్రీనివాసరావు, ముప్పాళ్ల బాలయ్య, రామారావు, నరసయ్య, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

**- జిల్లా కలెక్టర్ సి యం. సాయికాంత్ వర్మ**




**గుంటూరు.ఆగస్టు 24: రాజధాని వాయిస్:**జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి తమ సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశతో వచ్చే అర్జీదారుల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి యం. సాయికాంత్ వర్మ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ తో పాటు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ, డీఆర్వో ఖాజావలి, డిపిఓ సాయికుమార్ తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి,పారదర్శకంగా విచారణ నిర్వహించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపుతప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు.పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రత్యేక క్యూ లైన్లు, తాగునీటి సదుపాయం, ఉచిత భోజన ఏర్పాట్లు కల్పించింది. రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు, అర్జీదారులకు అవసరమైన ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టింది.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రముఖులకు తెలుగు వెలుగుల పురస్కార ప్రదానం

**గుంటూరు ఆగస్టు 24 రాజధాని వాయిస్:** స్థానిక బృందా వన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై యువకళావాహిని, కళావిపంచి సంయుక్త ఆధ్వర్యంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ప్రముఖులకు తెలుగు వెలుగు ల ఆత్మీయ పురస్కార ప్రధానోత్సవ సభ జరిగింది. సభకు యువకళావాహిని అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ, రాష్ట్ర నాటక అకాడమి ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, కళాపత్రిక సంపాదకులు డాక్టర్ మహమ్మద్ రఫీ, కళావిపంచి గౌరవ అధ్యక్షులు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, వేదిక అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్ బాబు, ఆలయ కమిటి అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, బొప్పన నరసింహారావు, డి. తిరుమలేశ్వరరావు, భాగి శంకరశాస్త్రి, జి. మల్లికార్జునరావు, జానీ బాషా తదితరులు పాల్గొని రంగస్థల రచయిత, దర్శకులు జరుగుల రామారావు, కథక్ కళాక్షేత్రం అధ్యక్షులు కథక్ అంజిబాబు, రంగస్థల నటుడు, గాయకుడు భాగి కృష్ణమూర్తి, పౌరాణిక రంగస్థల నటుడు ముప్వా పెదబాపిరెడ్డి లను తెలుగు వెలుగుల పురస్కారంతో ఘనంగా సత్కరించారు. సభానంతరం డాక్టర్ అంజిబాబు బృందం నిర్వహి ంచిన కథక్ నృత్యం, మానవతా యడ్లపాడు వారు వి.వి. భవానీ ప్రసాద్ రచనకు జరుగుల రామారావు దర్శకత్వం వహించిన బావా ఎప్పుడు వచ్చి తీవు నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది.

## కోటిరెడ్డి దంపతుల అరెస్ట్‌పై విడదల రజిని ఆగ్రహం పరామర్శ



**చిలకలూరిపేట. ఆగస్టు 24 రాజధాని వాయిస్:** కేసులో అరెస్టై వైద్య పరీక్షల నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత సింగారెడ్డి కోటిరెడ్డి (75), ఆయన భార్య లక్ష్మి (70)లను మాజీ మంత్రి విడదల రజిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, పార్టీ తరఫున పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా విడదల రజిని మాట్లాడుతూ, వృద్ధ దంపతులపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడం కూటమి ప్రభుత్వ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట అని మండిపడ్డారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కోటిరెడ్డిని లక్ష్యంగా చేసుకుని వరుస కేసులతో వేధిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఇలాంటి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని, ఈ కేసులపై న్యాయపరంగా పోరాడి వాస్తవాలను ప్రజల ముందుకు తెస్తామని స్పష్టం చేశారు.

## ఏపీ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు

**ఏపీ వక్ఫ్ బోర్డు అకౌంట్ అధికారి సయ్యద్ ఆదం షఫీ**



**పెదకాకాని,ఆగస్టు 24 రాజధాని వాయిస్:**-ఏపీ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ పర్యవేక్షణలో, సీసీ కెమెరాలు,వక్ఫ్ బోర్డు అధికారులు, రెవిన్యూ, పోలీసు శాఖల సమక్షంలో సోమవారం దర్గా హుండీ లెక్కిస్తున్నట్లు ఏపీ వక్ఫ్ బోర్డ్ అకౌంట్ అధికారి సయ్యద్ ఆదం షఫీ తెలిపారు. ప్రతి విషయం లైవ్ లో గమనిస్తుం టానని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పకడ్బందీగా దర్గా హుండీల లెక్కింపు పర్యవేక్షించాలని ఏపీ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ చెప్పినట్లు అకౌంట్ అధికారి తెలిపారు. అభివృద్ధికి, నిత్య అన్నదాన, మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ,ఉపాధి కార్యక్రమాలు ఏపీ వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ ఆదేశాల మేరకు త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు కార్యక్రమంలో ఏపీ వక్ఫ్ బోర్డ్ సూపరిడెంట్ షేక్.హైదర్ బాషా, కసుమూర్ కరీముల్లా దర్గా కార్యదర్శి షేక్ షరీఫ్, పెదకాకాని దర్గా కార్యదర్శి షేక్ ఖాజా మస్తాన్, దర్గా సిబ్బంది, పాల్గొన్నారు.

## శివాలయంలో జరిగే అక్రమాలు అధికార పార్టీ అండదండలతోనే అవినీతిపై రాసిన విలేకరులపై కేసులు..

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యలమందరావు**



**పెదకాకాని,ఆగస్టు 24 రాజధాని వాయిస్:** :-శివాలయంలో జరిగే కార్యక లాపాలని అధికార పార్టీ అండదండలతోనే జరుగుతు న్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కంతేటి యలమందరావు అన్నారు.ఆయన మాట్లాడుతూ మూడు పర్యాయాలు హుండీలు లెక్కింపు సమయంలో డబ్బులు దొంగతనం చేసిన వారిని ఆలయంలో మెయింటినెన్స్ చేయడం అంటే ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఎన్నోసార్లు బంగారం దొంగ తనాలు జరిగిన ఎందుకు వారిపై కఠిన నిర్ణయాలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదు. రాజకీయ నాయకుల ఒత్తిడితో చర్యలు తీసుకోవడం లేదా..? ఇటువంటి రాసిన విలేకరులపై కేసులు పెడతారా..? ఇది ఎంతవరకు కరెక్ట్ అని ఆయన అన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు శివాలయంపై దృష్టి పెట్టి ప్రత్యేక అధికారితో దర్యాప్తు జరిపించి దోషులను శిక్షించాలని కోరారు.

**గంగవరం గ్రామంలో వృద్ధుల ఆశ్రమం నందు అన్నదాన కార్యక్రమం**



**గురజాల, ఆగస్టు ఆగస్టు 24 రాజధాని వాయిస్:** రెంటచింతల మండలం మంచికళ్ళు గ్రామానికి చెందినటువంటి గోగుల పెద్ద పుల్లారెడ్డి తొమ్మిదవ వర్ధంతి సందర్భంగ వారి కుమారుడు గోగుల మణికంఠ రెడ్డి (యు కె ) లండన్ , గురజాల మండలంలోని గంగవరం గ్రామంలో అక్షయ ఫౌండేషన్ వృద్ధాశ్రమం నందు వృద్ధులకు కాయలు, పండ్లు , అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగ ఆశ్రమం వ్యవస్థాపకురాలు జి మల్లేశ్వరి మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం చాలా గొప్పదని వృద్ధుల మీద అభిమానంతో వారి కుటుంబ సభ్యులు ఆశ్రమం నందు అన్నదానం నిర్వహించినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ అన్నదానం కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు గోగుల మణికంఠ రెడ్డి, స్నేహితులు శీలం నేని గోపి, సతీష్, దీకొండ శ్రీరామ్, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com